# దండం పెడతాం.. దరఖాస్తు చేస్తాం.. డంపింగ్ యార్డ్ మాత్రం వద్దు..!







**సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ప్రతిపాదనపై మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆగ్రహం**

తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జులై 6

కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటును వెంటనే విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పచ్చని పంట పొలాల మధ్య చెత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం రైతుల జీవితాలతో చెలగాటమాడటమేనని ఆయన విమర్శించారు. ప్రశాంతమైన గ్రామాలను కాలుష్యం, రోగాల బారిన పడేలా చేసే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. "దండం పెట్టమంటే పెడతాం.. దరఖాస్తు చేయమంటే చేస్తాం.. కానీ డంపింగ్ యార్డ్ మాత్రం అంగీకరించం" అంటూ ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో ఈ భూములను పారిశ్రామిక అభివృద్ధి కోసం సేకరించామని, పరిశ్రమలతో పాటు రైతులకు టమాటా సాగుపై శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలనే లక్ష్యం ఉండేదని తెలిపారు. అయితే ప్రస్తుతం అదే భూములను డంపింగ్ యార్డ్‌కు కేటాయించడం రైతుల ఆశయాలకు, ప్రాంత అభివృద్ధికి విరుద్ధమని అన్నారు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటైతే ఈ ప్రాంతం మరో జవహర్‌నగర్‌గా మారే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర చెత్తను ఇక్కడికి తరలిస్తే గాలి, నీరు కలుషితమవడంతో పాటు వ్యవసాయం దెబ్బతింటుందని, భూముల విలువలు పడిపోతాయని, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. సమీప గ్రామాలన్నీ ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ ప్రాంతంలో ఎస్సీ గురుకుల పాఠశాల, దేవాలయాలు వంటి ప్రజా ప్రయోజన సంస్థలు ఉన్నాయని, ఇలాంటి ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ఏమాత్రం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఉద్యమం తీవ్రంప్రభుత్వం డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను కొనసాగిస్తే గాంధేయ మార్గంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. ఇది రాజకీయ అంశం కాదని, ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య అని పేర్కొంటూ అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాలకు, రైతులకు కలిసి పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈటా గణేష్, బీఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, రాంబాల నాయక్, చేగుర్ మాజీ సింగిల్ విండో చైర్మన్ మామిళ్ల విట్టల్, బండోనీ గూడ సర్పంచ్ జట్ట కుమార్, తాజా మాజీ కౌన్సిలర్ మాదారం నరసింహ గౌడ్, మాజీ సర్పంచ్ వద్దే బాలయ్య, మాజీ సర్పంచ్ రమేష్ నాయక్, మరియు గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా యాక్షన్... భూ కబ్జాదారులపై ఉక్కుపాదం

**హైకోర్టు సర్వే రిపోర్ట్ ఆధారంగా అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్లాట్ల యజమానులకు న్యాయం అమీన్‌పూర్ పోలీసుల సహకారానికి ప్రశంసలు**

అమీన్‌పూర్, జూలై 4: తెలుగు జ్యోతి రిపోర్టర్ మన్నె. ప్రసాద్





సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ సిఎంసి పరిధిలో సంవత్సరాలుగా కొనసాగుతున్న భూ కబ్జా వివాదానికి ఎట్టకేలకు ముగింపు పలుకుతూ హైడ్రా అధికారులు కీలక చర్యలు చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించిన అడ్వకేట్ కమిషనర్ సర్వే రిపోర్ట్ ఆధారంగా అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్, గేట్‌ను కూల్చివేసి, మూసివేయబడిన పబ్లిక్ రోడ్లను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గత ఎనిమిదేళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్న ప్లాట్ల యజమానులకు ఊరట లభించింది. అమీన్‌పూర్ గ్రామంలోని సర్వే నెంబర్లు 386/అా, 576, 577, 588, 589, 590, 591/అా, 591/ఎ ఎ పరిధిలో ఉన్న సాయి టౌన్‌షిప్ లేఅవుట్లో భూ ఆక్రమణలు జరిగాయని ప్లాట్ల యజమానులు చాలా కాలంగా ఆరోపిస్తూ వస్తున్నారు. తమకు చెందిన ప్లాట్లు, పబ్లిక్ రోడ్లను అక్రమంగా ఆక్రమించి భారీ కాంపౌండ్ వాల్ నిర్మించారని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్లాట్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాల మేరకు అడ్వకేట్ కమిషనర్ సర్వే ( ఈ ఎఫ్ ఆర్ ఎన్ ఓ .159/25, తేదీ: 12-03-2025) నిర్వహించబడింది. ఆ సర్వేలో ఇతరుల ప్లాట్లు మరియు ప్రజా రహదారులు ఆక్రమించబడినట్లు స్పష్టంగా నిర్ధారణ కావడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ కూల్చివేతల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు సమర్థవంతంగా భద్రత కల్పించి, హైడ్రా అధికారులకు పూర్తి సహకారం అందించారు. పోలీసుల సమన్వయంతో మొత్తం ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయిందని స్థానికులు తెలిపారు.

ఈ సందర్భంగా ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ, "ఎనిమిదేళ్లుగా చేసిన న్యాయ పోరాటానికి నేడు ఫలితం దక్కింది. హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తూ చర్యలు తీసుకున్న హైడ్రా అధికారులకు, రెవెన్యూ అధికారులకు, ఆర్‌డీవో కార్యాలయానికి, అలాగే విధి నిర్వహణలో పూర్తి సహకారం అందించిన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పోలీసులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. భవిష్యత్తులో కూడా అమీన్‌పూర్ సిఎంసి పరిధిలో ప్రభుత్వ భూములు, ప్రజా రహదారులు, పార్కులు మరియు ఓపెన్ స్పేస్‌లపై జరిగే ఎలాంటి భూ కబ్జాలను అరికట్టేందుకు ఇదే తరహా చర్యలు కొనసాగాలని కోరుతున్నాం" అని తెలిపారు. అమీన్‌పూర్ సిఎంసి పరిధిలో ప్రభుత్వ భూములు, లేఅవుట్ రోడ్లు మరియు ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమించే వారిపై అధికారులు ఇదే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు. న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేస్తూ ప్రజలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం, హైడ్రా, రెవెన్యూ శాఖ మరియు పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు

# అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు

**అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులు అర్పించిన నాయకులు**

నిజాంపేట్ తెలుగు జ్యోతి ప్రతినిధి జులై 4

నిజాంపేట సర్కిల్ ప్రగతి నగర్ డివిజన్ లోని మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను విగ్రహ కమిటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాట యోధుడు, మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామ రాజు 129వ జోహార్లు తెలుపుతూ భారత స్వాతంత్రం కోసం తన ప్రాణాలను భరతమాత సేవకై పునరంకితమవడం జరిగింది. అవక్ర పరాక్రమంతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించి భరతమాత దాస్య శృంఖల ఛేదనకై తన ప్రాణాన్ని తృణప్రాయంగా సమర్పించిన వీరుడన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డాక్టర్ రాజు, దాసి నాగరాజు వామపక్ష నాయకులు వెంకటరామయ్య, వెంకటరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ బి పల్లి గ్రామ దొడ్డి కొమరయ్య ఆశయాలే రైతాంగానికి స్ఫూర్తి: మాజీ జెడ్పిటిసిబి ఎమ్మె శ్రీలత సత్యనారాయణ



తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జులై 4

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య త్యాగం చిరస్మరణీయమని కొత్తూరు మాజీ జెడ్పిటిసి ఎమ్మె శ్రీలత సత్యనారాయణ అన్నారు. శనివారం కొత్తూరు మండలం ఎస్‌బి పల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సత్యనారాయణ మాట్లాడుతూ, రైతుల హక్కులు, సామాజిక సమానత్వం కోసం దొడ్డి కొమరయ్య చేసిన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తిని నేటి తరాలు ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ ఉద్యమానికి దొడ్డి కొమరయ్య చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సున్నాల గణేష్, బీఆర్ఎస్ యూత్ నాయకుడు కడాల శ్రీశైలం, సీనియర్ నాయకులు దేశాల భీమయ్య, దామోదర్ రెడ్డి, ఉమా మహేష్ తదితరులు పాల్గొని దొడ్డి కొమరయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

## స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన టీజీఐఐ సీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి.



తెలుగు జ్యోతి న్యూస్ 4 జూలై సంగారెడ్డి ప్రతినిధి.

స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని (ఐ బి) ఆవరణలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన పిజిఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించేందుకు ఆయన చేసినా కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రతి యువకుడు స్వామి వివేకానంద ఆశాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు అంకితాభావంతో ముందుకు సాగాలని నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించి దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జార్జ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చుదురుప్ప ప్రభు గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గంగేరి శ్రీహరి, మొగులయ్య, వంశీ ,అడ్డు రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కెప్టెన్ల ఎన్నిక







**క్రమ శిక్షణ కు మారు పేరు జ్యోతి విద్యాలయ హై స్కూల్ - సి ఐ. జగన్నాద్**

తెలుగుజ్యోతి, శేరిలింగంపల్లి, జులై4:

క్రమ శిక్షణ కు మారు పేరుగా జ్యోతి విద్యాలయ హై స్కూల్ నిలుస్తుందని ఆర్.సి.పురం సర్కిల్ ఇన్స్ పెక్టర్ డాక్టర్ జగన్నాథ్ అన్నారు. బి హెచ్ ఇ ఎల్. టౌన్ షిప్ లోనిజ్యోతి విద్యాలయ హై స్కూల్ లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార ఉత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇంత బాగా జరగడం చాలా సంతోషకరమని,

క్రమశిక్షణ, విద్యా నైపుణ్యం, మరియు అందరినీ కలుపుకొనిపోయే నాయకత్వ లక్షణాలు ఉన్న విద్యార్థులను కెప్టెన్స్ గా ఎన్నుకోవడం చాలా అభినందనీయమైన విషయమన్నారు. ఇలాంటి అర్హతలున్న విద్యార్థులే రేపటి సమాజానికి మంచి పౌరులుగా ఎదుగుతారనీ, పాఠశాలను అభినందిస్తూ పిల్లలకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని, బాధ్యతను పెంచుతుందనీ, ప్రిన్సిపల్ ఉమా మహేశ్వరి, ఫాదర్ అంబ్రోస్ బెక్ ల మార్గదర్శకత్వంలో, ఈ కొత్త స్టూడెంట్ లీడర్స్ అందరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, స్కూల్ కీర్తిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆశిస్తున్నాననీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్. ఐ. ప్రియదర్శిని కెప్టెన్లకు స్లాష్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, స్కూల్ ఉపాధ్యాయురాళ్ళు, సిబ్బంది పాల్గొన్నారు.

